# బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి భద్రతా చర్యలు చేపడతాం : కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

వాహనదారులు వాహనాలను నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని నడపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం చిత్తూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వద్ద గల ఆర్టీఓ కార్యాలయం నుండి మోటార్ వాహనాల ర్యాలీని జిల్లా కలెక్టర్, డిటిసి నిరంజన్ రెడ్డితో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ దర్గా సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్‌కు చేరుకొని తిరిగి పివికెన్ కళాశాల వరకు కొనసాగింది. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 16 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సడక్ సురక్షా అభియాన్ కింద రోడ్డు భద్రతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు అవగాహనా కార్యక్రమాలను చేపట్టాడుతున్నామని అన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో సంభవించిన రోడ్డు ప్రమాదాల మరణాలలో ద్విచక్ర వాహనదారులు అధికసంఖ్యలో మరణించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయని, యువత మద్యం తాగి అతివేగంగా వాహనాలను నడపడం వలన కూడా మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయని తెలిపారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి జాగ్రత చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే గుంతలను పూడ్చడం, పెండింగ్ ఉన్న రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కుటుంబాల గురించి ఆలోచించాలని, ద్విచక్ర వాహనాదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్ కుమార్, ఎంవిఐ, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

# మారని దళితుల బతుకులు

## కలెక్టరేట్ ఎదుట వ్యకాసం ధర్నా

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** స్వాతంత్రం వచ్చి 76 ఏండ్లు గడస్తున్నా నేటికీ దళితుల స్థితిగతుల్లో మార్పు రాలేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబుల్‌రాజు, చిరంజీవమ్మ అన్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో నిర్వహించిన సర్వేలో దళితుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, అనేక దళితవాడల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవన్నారు. సెంటు భూమి కూడా లేదని ఉన్న భూములను సైతం అగ్రకుల పెత్తందార్లు ఆక్రమించుకుంటున్నారని అన్నారు. భూమిలేని దళితులు ప్రభుత్వ , డీకేటి భూముల్లో సాగు చేస్తుంటే అగ్రకులస్తుల నుండీ ఒత్తిళ్ళు, దాడులు తప్పడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం దళితుల భూములు అక్రమించుకుంటున్న వారికి వెన్నుదన్నుగా నిలవడం సరైన పద్ధతి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన దళిత వాడల సర్వేలో వెలుగు చూసిన అనేక అంశాలను నివేదక రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందజేశామని దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. అలాగే దళితుల ఆధీనంలో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని, భూమి లేని వారికి సాగు భూములు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఈశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వ్యకాసం నేతలు

## నియోజకవర్గానికి రూ.8.54కోట్లు మంజూరు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేస్తుందని, ఇందుకోసం యువత, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బీసీ కార్పొరేషన్, ఇతర కార్పొరేషన్ల ద్వారా 398 యూనిట్లు, రూ.8.54 కోట్ల నిధుల మంజూరు అయ్యాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో బీసీ కార్పొరేషన్ (302, మెడికల్స్ 3), బ్రాహ్మణ కార్పొరేషన్ 4, ఈబీసీ కార్పొరేషన్ 15, కమ్మ కార్పొరేషన్ 13, క్షత్రియ కార్పొరేషన్ 2, రెడ్డి కార్పొరేషన్ 11, వైశ్య కార్పొరేషన్ 2, కాపు కార్పొరేషన్ 45, ఎంఎస్ ఎంఈ 1 (కాపు), యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. పై యూనిట్లకు సంబంధించి రూ.8.54కోట్లు మంజూరు అయ్యాయని, ఇందులో రూ.4.24కోట్లు రాయితీగా, రూ.4.24 కోట్లు రుణంగా అందించడం జరుగుతుందన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల కోసం 21 నుంచి 60 సంవత్సరాలు, కాపు కార్పొరేషన్ సంబంధించి 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అర్హులైన వారు ఫిబ్రవరి 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను గ్రామ/ వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైనో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## వైసిపి నేతల అవినీతిని నిగ్గు తేలుస్తాం

**టిడిపి ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్**

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** వైసిపి అవినీతి అక్రమాలను నిగ్గు తేలుస్తామని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ శాఖ మంత్రిగా ఉన్న కాలంలో అటవీ భూములను ఆక్రమించుకోవడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అటవీ మంత్రిగా ఉంటూ పులిచెర్ల మండలం మంగళంపేట అటవీ ప్రాంతంలో భూములను అన్యాక్రాంతం చేసిన ఘనత వైసిపి పాలనకు నిదర్శనం అన్నారు. తప్పు చేయకుంటే కమిటీ ముందు హాజరుకావాలని సవాలు విసిరారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సురేంద్ర కుమార్, అరుణ పాల్గొన్నారు.

**అంతర్జాతీయ కంపెనీలకు ఎంపికైన**

## ప్రభుత్వ పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు

**ప్రజాశక్తి- పలమనేరు:** రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు ప్రతిష్టాత్మకంగా టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీ కొరకు ప్లేస్ మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 30 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుండి సుమారు 800పై చిలుకు విద్యార్థులు రాత పరీక్షలో పాల్గొనగా 17 పాలిటెక్నిక్ నుండి 98 మంది ఇంటర్వ్యూకి ఎంపిక కావడం జరిగింది. అందులో7 పాలిటెక్నిక్‌లకు సంబంధించిన 15 మంది విద్యార్థులు కంపెనీకి ఎంపిక అయ్యారు. ఈ 15 మందిలో పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఎలెక్ట్రికల్ అండ్ ఎలెక్ట్రానిక్స్ చివరి సంవత్సరం విద్యార్థిని కుమారి ఎం.పూర్ణిమ, ఏడాదికి 9.02 లక్షల ప్యాకేజీతో ఎంపిక అయ్యారు. పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ బెహర శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని డిప్లమో స్థాయిలోనే ఇంత పెద్ద ప్యాకేజీతో అంతర్జాతీయ కంపెనీకి ఎంపిక కావడం చాలా గర్వకారణమని, మిగిలిన విద్యార్థులు కూడా దీనిని ఒక ప్రేరణ గా తీసుకుని మంచి ప్లేస్ మెంట్స్ సాధించాలని చెప్పారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ జయపాల్, సంబంధిత అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హెడ్స్ డాక్టర్ మహమూద్, ప్రసన్న, డాక్టర శ్రీవిద్య, డాక్టర్ స్రవంతి, డాక్టర్ జయపాల్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్ ఉద్యోగిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని**

**కుప్పం టౌన్:** కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసి జేమ్స్ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని వి.తేజశ్రీ టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్ ఉద్యోగిగా ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణం అని ప్రిన్సిపల్ జగన్నాథ రావు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ ప్రాంగణ నియామకాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ నియామకలాలో తమ కళాశాల విద్యార్థినీ తేజశ్రీ సంవత్సరానికి 9.02లక్షల వేతనంతో అంతర్జాతీయ స్థాయి పేరుగాంచిన 'బిట్స్ పిలాని' విద్యాసంస్థలో బి.టెక్. చదువుకొను అవకాశం కల్పించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, ఇ.సి.ఇ. విభాగాధిపతి జి.రామకృష్ణ రావు, ఇ.ఇ.ఇ. విభాగాధిపతి సి.హెచ్. సుబ్బన్న, కళాశాల సిబ్బంది సుజాత, బాపూజీ నాయక్, డాక్టర్ డిఎన్ రమేష్, టి.శిరీష, రాధ తేజశ్రీని అభినందించారు.

# మహాత్మా గాంధీకి ఘన నివాళి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. గురువారం ఉదయం గాంధీ విగ్రహ కూడలిలోని గాంధీ విగ్రహానికి మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డిలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన మార్గంలో పయనించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన మాటలు నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న మేయర్, కమిషనర్

**కుప్పం టౌన్ :** జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయం, కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఘన నివాళులు అర్పించారు. టిడిపి కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

కుప్పంలో..

**పలమనేరు:** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్, మొహిద్దీన్, రెవెన్యూ అధికారి రవి రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహప్రియ, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ఇందిర, మెప్మా సిఎంఎం బాబు పాల్గొన్నారు.

పలమనేరులో..

# చిరుత దాడిలో మేకలు మృతి

- భయాందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

**ప్రజాశక్తి- గుడిపాల:** అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంతో చిరుత దాడి చేసి మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని అడవి చేను గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు కథనాల మేరకు అడవి చేను గ్రామానికి చెందిన రామకృష్ణ అనే పాడి రైతు మేకలు మేపడానికి ప్రతిరోజు అడవీ ప్రాంతానికి వెళ్లేవాడు. రోజు మాదిరిగానే గురువారం కూడా అడవికి మేకలు తోలాడు. మేకలు మేస్తుండగా చిరుత ఒక్కసారిగా దాడి చేయడంతో ఐదు మేకలు చనిపోయాయని రైతు తెలిపాడు. నిర్లక్ష్యంగా ఉంటే తన ప్రాణం కూడా పోయి ఉండేదని రామకృష్ణ వాపోతున్నాడు. ఇప్పటికే అనేకసార్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ మేకలు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తమను ప్రభుత్వం ఆదుకొని రక్షణ కల్పించవలసిందిగా ఆయన కోరారు. చిరుత సంచారంతో ఆ గ్రామస్తులు భయాందోళనలతో బెంబేలెత్తి పోతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన గ్రామస్తులు కోరుతున్నారు.



# పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఎస్ఎంఈ ఏడీ మూర్తి

అవగాహన కనిపిస్తున్న జిల్లా డిఆర్‌డిఏ అధికారులు

**ప్రజాశక్తి- యాదమరి :** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ ఎంఈ అడిషనల్ డైరెక్టర్ మూర్తి తెలిపారు. గురువారం చిత్తూరు డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి జీవనోపాధులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందన్నారు. ప్రధానంగా చేతి వృత్తిదారుల నైపుణ్యాన్ని వెలికి తీసి వారికి ఆదాయ మార్గాలు కల్పించాలన్న సదుద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని చేతి వృత్తిదారులు సద్వినియోగం చేసుకుంటే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా చేతివృత్తుల వారికి తాము ఎంచుకున్న కళారంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించి, దానికి అనుగుణంగా పనిముట్ల కిట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ ఈపథకం ద్వారా లబ్ధిదారులు ఎంపిక రుణాల మంజూరు, మార్కెటింగ్ సదుపాయాలు తదితర అంశాల గురించి వివరించారు. మెప్మా పీడీ రవీందర్, డిఐసి వెంకటరెడ్డి, డిపిఎంలు రవి, సరిత, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, ఏపీఎంలు మధుసూదన్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, సురేష్ రవికుమార్ పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.సుధారాణి ఆదేశాలతో ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నగర పరిధిలోని కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో కుష్టి వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఎల్‌సిడిసి సర్వే కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి నెల రెండవ తేదీ వరకు ప్రతి ఇంటిలో లెప్రసీ కొత్త కేసుల సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. లేప్రసి అని నిర్ధారించిన వెంటనే ఎండిటి చికిత్స తీసుకోవాలని తద్వారా వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి అనిల్ కుమార్, డెమో జయ రాముడు, ఏపీడీ మియాలజిస్ట్ శ్రీవాణి, డాక్టర్ సాయి షర్మిల, డిపిఎంఓ రవికుమార్, జాన్, కాజూరు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**యాదమరి:** కుష్టు రహిత దేశస్థాపనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పిహెచ్‌సి వద్ద జాతీయ కుష్టు నివారణ దినోత్సవ ప్రతిజ్ఞ చేపట్టారు. హెల్త్ సూపర్వైజర్ సెల్వరాని, ఎంఎల్‌హెచ్‌పి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

**గంగాధర నెల్లూరు:** జాతీయ కుష్టువ్యాధి దినోత్సవం సందర్భంగా గంగాధర నెల్లూరు ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో కుష్టువ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బందితో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. సిహెచ్‌ఓ శ్రీనివాసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో..

**బంగారుపాళ్యం:** వ్యాధిగ్రస్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులకు లోహిత్ చెంగల్ రాయలు అన్నారు. గురువారం జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. సిహెచ్‌సి వైద్యాధికారి శిరీష, డాక్టర్ రమేష్, డిపిఎంఓ మనీ, ఏపీఎంఓ హరికృష్ణ, ఎంపీహెచ్‌పి రమేష్ బాబు, అముద పాల్గొన్నారు.

**విజయపురం:** వైద్యాధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే కార్యక్రమం, అవగాహన ర్యాలీ నిర్వహించారు.

**రొంపిచర్ల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ లెప్రసీ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు దినేష్ కుమార్ నాయక్, వినయ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**పెద్దపంజాణి:** కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని, వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాయలపేట వైద్యాధికారిణి నందిని అన్నారు. గురువారం ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం సందర్భంగా చల్లావారిపల్లిలో 104 సిబ్బంది అవగాహన కల్పించారు. రాయలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు.

జిడి నెల్లూరులో..

పెద్దపంజాణిలో

## ఎస్టీ కాలనీలను సందర్శించిన జెసి

**ప్రజాశక్తి- చౌడేపల్లి:** మండలంలోని పలు ఎస్సీ కాలనీలను జాయింట్ కలెక్టర్ విద్యాధరి గురువారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తన పర్యటనలో చెప్పిన విధంగా రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలపై ఆరా తీశారు. అదేవిధంగా ప్రతి యానాది కుటుంబానికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని తహశీల్దార్ హనుమంతును ఆదేశించారు. ఎస్టీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గుణశేఖర్, రెవెన్యూ సిబ్బంది యానాదులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తాం.. కడా పీడీ

ప్రధాన రహదారులను పరిశీలించిన కడా పీడీ

**ప్రజాశక్తి- కుప్పం టౌన్:** కుప్పం పట్టణాన్ని సుందరీకరించి, రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేస్తామని కడా పీడీ వికాస్ మరవత్ తెలిపారు. ఆయన గురువారం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించడానికి అవసరమైన చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులను పరిశీలించి, ప్రధానంగా రోడ్డు పక్క వ్యాపారాలు చేసుకునే వారి అభిప్రాయాలను సేకరించారు. పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం అయినా కుప్పంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడానికి, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రత్యేకంగా పట్టణ అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాసరాజు, పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్, పట్టణ అధ్యక్షులు రాజకుమార్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము పాల్గొన్నారు.

## అక్రమాలు నిగ్గు తేల్చాలి: ఎమ్మెల్యే

మున్సిపల్, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరులోని గంటావూరు ఇందిరమ్మ కాలనీలో అక్రమాలపై వెంటనే విచారణ జరిపి నిజాన్ని నిగ్గు తేల్చాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి అధికారులను ఆదేశించారు. గంటావూరు కాలనీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ వార్తా కథనాలు ప్రచురితం కావడంపై ఆయన స్పందించారు. దీంతో గురువారం ఆయన తన కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారుల అలసత్వంతో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే చేపట్టిన విచారణతో గుర్తించిన ఖాళీ స్థలాలను అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకుందామని, అంతవరకు అక్రమాలు జరగకుండా ఆపాలని సూచించారు. అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దన్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే అక్రమార్కులు ఇష్టానుసారం కబ్జాలకు పాల్పడుతున్నారని, కాబట్టి ఫోర్జరీ పట్టాల బాగోతాన్ని సైతం బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో అక్రమాల నిగ్గు తేల్చి అనర్హులను గుర్తించాలన్నారు. ఇప్పటికే ఇతర ప్రాంతాల వారితో గంటావూరు కాలనీ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రెండు, మూడు రోజులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసిల్దార్ ఇన్బనాథన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏలు

**పజాశక్తి - రొంపిచర్ల :** ఉమ్మడి చిత్తూరు జిల్లా రొంపిచర్లకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను గురువారం గౌరవపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ గ్రామ రెవెనూ సహాయకుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వై.లక్ష్మణ్, టి.కోదండన్, ఎస్.దేవరాజ్, ఎస్.ఇర్ఫాన్ అలీ, అశోక్, సాంబయ్య, నాగరాజ్, అంకయ్య, నాగరాజ్ పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ శుద్ధ అబద్ధం: వైసిపి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** సూపర్ సిక్స్‌పై చిత్తూరు వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో నాయకుల గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నాయకులు గాయత్రీ దేవి, జ్ఞాన జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీలు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశాయన్నారు. సూపర్ సిక్స్ హామీలకు సంబంధించిన ప్లకార్డు చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం చేశారని, ఆదాయం కూడబెడుతామని దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురెడ్డి, రాసానపల్లి ప్రకాష్, కేపీ శ్రీధర్, మధు రాయల్, బాబు నాయుడు, త్యాగరాజులు, సూర్య ప్రతాప్, రజనీకాంత్, ఉన్ని కృష్ణన్, నారాయణ, లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలి

**నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి**

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రతి ఒక్కరికి విద్య అందాలని, కులమత ప్రాంతాలకు అతీతంగా అందరికీ ఉన్నత విద్య అభ్యసించాలని ఉన్నత ఆశయంతో ఫీజు రియంబర్స్మెంట్ ప్రవేశ పెట్టడం జరిగిందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మీ అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, గోరుముద్ద, సంపూర్ణ ఆహారం వంటి పథకాలతో విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు కృషి చేశారని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని, ఇంతవరకు విద్యార్థులకు ఎందుకు ఫీజు రియంబర్స్ చెల్లించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించవలసిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మౌలిక వసతులను పరిశీలించిన ఎంపీపీ

**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో కల్పించిన మౌలిక వసతులను ఎంపీపీ రెడ్డప్ప గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చలమంగళం, నేలపల్లి, కొళత్తూరు, నడింపల్లి, గౌదమాకులపల్లి, పెదకాప్పల్లి, నగిరేపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం పనులను ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి శారదా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గ్రామాలలోని అంగన్వాడీ పాఠశాలలను పరిశీలించారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - రామకుప్పం:** సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తహసిల్దార్ కే.బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గడ్డూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ పౌరహక్కుల సమావేశం తహశీల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ దళితులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల అవగాహనతోపాటు సమాజం పట్ల బాధ్యత ప్రతి ఒక్కరికి వర్తిస్తుందన్నారు. దీన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అందరూ సద్వినిగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. సర్పంచ్ రాజగోపాల్, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, ఆర్ఐ నారాయణ, వీఆర్వో హరినాథ్‌రెడ్డి, మునిరెడ్డి, సతీష్, జనసేన భాస్కర్ పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన వెంకట రమణ

**ప్రజాశక్తి -రొంపిచర్ల:** రొంపిచర్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.వెంకటరమణ, బాలిక శిశు సంక్షేమ అధికారిణి ఇందిరా దేవి సందర్శించడం జరిగింది. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిసిడిఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన వెంటనే ఒకటి లేదా రెండు రోజులలో దీనికి సమాధాన పత్రాలు స్పెషల్ ఆఫీసర్‌కు అందించాలని, ఎస్ఓ దానిని పరిశీలించి సరైన సమాధానాలు ఉపాధ్యాయులకు అందించాలన్నారు. పాఠశాల సిబ్బంది విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని, సిబ్బంది అందరూ పరస్పరం గౌరవించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు లేవనెత్తిన సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి వారు పాఠశాల లోటుపాట్లు ఉంటే సరి చేసుకోవాలన్నారు. పిల్లలకు ఉన్న అన్ని సౌకర్యాలు అందుతున్నాయో లేదో అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు ఎన్.ఇందిర, డి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి కిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులు అధైర్యపడొద్దు: సివిల్ జడ్జి

**ప్రజాశక్తి-గుడిపాల:** దివ్యాంగులు అధైర్యపడవద్దని చిత్తూరు సివిల్ జడ్జి భారతి అన్నారు. గురువారం గుడిపాల మండల కేంద్రంలోనీ భవిత కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రత్యేకంగా అందిస్తున్న పిజియో థెరపీ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు పిల్లలకి అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్‌బిఎస్‌కె శిరీష, డీఈఐసి హేమ ప్రసాద్, పిహెచ్‌సి డాక్టర్ సంధ్య, ఐఈఆర్ టీచర్ వాణి పాల్గొన్నారు.

## రూ.1.52లక్షల ల్యాబ్ మెటీరియల్ వితరణ

**ప్రజాశక్తి- యాదమరి:** కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌కి షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ ఎల్.జోసఫ్, మేరి ఆధ్వర్యంలో గ్లోబెల్ కాంపేషన్ ఐఎన్‌సి, యుయస్ఎ (అమెరికా) వారు సుమారు రూ.1.52 లక్షలు విలువైన సైన్సు ల్యాబ్ మెటిరీయల్, రెండు బీరువాలు వితరణగా ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ ఎపి.లలిత తెలిపారు. జువాలజీ అధ్యాపకులు సి.మహేష్ అభ్యర్థన మేరకు వారు పాఠశాలకి సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ ల్యాబ్ ఇకపై ఇంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. గత సంవత్సరం జోసఫ్ దంపతులు సుమారు రూ.10వేలు విలువైన స్టడీ మెటీరియల్ అందించడం జరిగిందన్నారు. అనంతరం జోసఫ్, మేరిలను ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, సుధాకర్, మధుసూదన్, రాజరాజేశ్వరి, లీలారాణి, వాణి, ఉష, భారతి, కనకాబారి, సుల్తాన్, నరసింహారెడ్డి, మురళీధర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దబ్బ నాయుడు మృతికి నివాళి

**ప్రజాశక్తి - రామకుప్పం:** మండలంలోని వీర్నమల పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దబ్బ నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, టీడీపి నేతలు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి, సభ్యత్వానికి పెద్దబ్బ నాయుడు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. గ్రామాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. ఆయన టిడిపికి తీరని లోటు అన్నారు. రాష్ట్ర నేతలు మునస్వామి, మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, చిన్నకృష్ణ, చలపతి, గంట్లప్ప గౌడు, నాగరాజు, కృష్ణా నాయక్, పాండియన్, టీవీ రవి, సత్తి పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డిపిఓ

**ప్రజాశక్తి- విజయపురం (నగిరి):** నగిరి మండలంలో వికెఆర్ పురం, వీఎన్ఆర్ పేటలో డీపీఓ సుధాకర్ రావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు కనిపిస్తోందని, తాను పరిశీలించిన గ్రామాల్లో చెత్తాచెదారం డ్రైనేజీ వాడకం వంటి, పారిశుధ్య పనులు ఎక్కడ గాని చేసినట్లు కనిపించడం లేదని, ఇలాగే పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగిరి మండలంలో 21 సచివాలయం వ్యవస్థ ద్వారా 18 మంది పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉన్న నగరి మండలంలో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోందని ఇకపై పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని శ్రీశక్తి భవనంలో గురువారం పారిశుధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో చిన్నచిన్న డ్రైనేజీలు కూడా తీయడం లేదని మెయిన్ రోడ్లపై చెత్త కుప్పలు తీయరా అని, సెక్రటరీలు పట్టించుకోకుండా ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పారిశుధ్య పర్యవేక్షణకు, సెక్రటరీలు ఇంతమంది ఉన్నా శానిటేషన్ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు.

**ప్రతి ఒక్కరు ఎస్‌డబ్ల్యూపిసి వాడకంలో తేవాలి**

ఎస్‌డబ్ల్యూపిసి లేని పంచాయతీలో వెంటనే ప్రపోజల్ పంపించాలని కోరారు. గ్రామాల్లో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పైన పారిశుధ్యం మెరుగుపరచాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రోడ్లపైన కుక్కలు, ఆవులు, పందులు ఎక్కడ చూసినా ఉన్నాయని వాటి గురించి పట్టించుకోరా అని ప్రశ్నించారు. రోడ్ సైడ్‌లో చికెన్, మటన్ చాలా మంది అమ్ముతున్నారని వారు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్రటరీలు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళుతున్నారో తెలియటం లేదని సమయపాలన పాటించాలని సూచించారు. శానిటేషన్‌లో అందరూ మొదట్లో ఉండాలని, కానీ చివర్లో ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వైర్ లెస్ సెట్ దగ్గర ఉంచుకోవాలని, డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ చేయాలన్నారు. డ్రైనేజీల క్లీనింగ్ ప్రతిరోజూ ఒక గంట వర్కర్స్‌తో చేయించాలని, ఓపెన్ సైట్స్, ప్రైవేట్ సైట్స్ క్లీన్ చేయించేలా చూడాలన్నారు. ఉద్యోగం బాధ్యతగా చేయాలని, క్లాప్ సక్సెస్ అవ్వాలంటే హోమ్ కంపోస్టింగ్ ప్రతి ఇంటిలో తప్పకుండా చేసేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం గ్యాంగ్ వర్క సరిగ్గా చేయడం లేదని శానిటేషన్ సెక్రటరీలు చేరి యేడాది అవుతోందని ఇప్పటివరకు మీ ఏరియాలో ఓపెన్ సైట్స్, ప్రైవేట్ సైట్ క్లీన్ చేయించలేదని వాటి అన్నింటికీ నోటీసులు ఇచ్చి వెంటనే క్లీన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగిరి ఎంపీడీవో సతీష్, విజయపురం ఎంపీడీవో రాజేంద్ర, నగిరి ఈఓపిఆర్‌డి అరుణమ్మ, నింద్ర ఈఓపిఆర్డి లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర కుమార్, బాబు, ఉదయ్ కుమార్, చిరంజీవి, ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీరకుప్పం ఎస్‌డబ్ల్యూ పిసిని పరిశీలిస్తున్న డిపిఓ సుధాకర్ రావు

జీడీనెల్లూరు నియోజకవర్గ

## వైసిపి మహిళా అధ్యక్షురాలుగా రాధిక

**ప్రజాశక్తి- వెదురుకుప్పం :** జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షురాలుగా వెదురుకుప్పం ఎంపిటీసీ సభ్యురాలు ఎన్.రాధిక నియమితులయ్యారు. తనకు పదవి రావడంతో బాధ్యత మరింత పెరిగిందని ఆమె అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి, వెదురుకుప్పం ఎంపిపి నాగరాణి, వైస్ ఎంపిపిలు రమణ, సుబ్రహ్మణ్యం, విజయ, మునికృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుకుమార్‌కు ధన్యవాదాలను తెలియజేశారు.

వైసిపి నియోజకవర్గ

## లీగల్ సెల్ అధ్యక్షులుగా హరిబాబు

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులుగా హరిబాబును నియమించారు. ప్రస్తుతం ఆయన గంగాధర నెల్లూరు మండల వైస్ ఎంపీపీగా ఉన్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కృపాలక్ష్మికి, మాజీ మంత్రి నారాయణ స్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యేకు ఆలయ మహోత్సవ ఆహ్వానం

**ప్రజాశక్తి- గంగవరం:** మండలంలోని ఆలయాల్లో జరుగుతున్న మహోత్సవ కార్యక్రమాలకు విచ్చేయాలని ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆహ్వానించారు. పలమనేరు వాసవి వైభవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరుగుతున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన ఆత్మార్పణ మహోత్సవానికి ఆయన్ను ఆహ్వానించారు. నిర్వాహకులు ఆర్వీ.బాలాజీ, సత్య, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఉన్నారు.

## బీసీల అభివృద్ధికి రూ.896 కోట్ల నిధులు

**ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:** సీఎం నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల కృషితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల కోసం వివిధ పథకాలకు 896 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేశారని జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం బీసీలకు మొండి చేయి చూపించిందని, బీసీలు ఎదురుచూస్తున్న ప్రస్తుతం మారిన ప్రపంచీకరణలో చేతివృత్తులు ఈ నిధులు బీసీల భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

## డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

**ప్రజాశక్తి- విజయపురం (నగిరి):** స్థానిక ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను, స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ కోరారు. రాష్ట్ర ఉన్నత విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు డిగ్రీ కళాశాల అధ్యాపకులు (ఓపెన్ డే) కార్యక్రమంలో భాగంగా, ఇంటర్మీడియట్ కళాశాలలను సందర్శించి నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులు, అవకాశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించామని, వారిని డిగ్రీ కళాశాలను సందర్శించాల్సిందిగా కోరారు. ఓరింటేషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులు నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులు, డిజిటల్, వర్చువల్ తరగతి గదులు, జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్.సి.సి, కంప్యూటర్ లాబ్స్, సైన్స్ లాబ్స్, పుస్తక భాండాగారమైన కళాశాల గ్రంథాలయం, విశాలమైన ఆటస్థలం, ఉద్యోగ మేళాలు అన్నింటికీ మించి అత్యున్నత విద్యార్హత, నైపుణ్యం కలిగిన బోధనా సిబ్బంది మొదలగు విశిష్టతలను కలిగి ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వినియోగించుకోవాలని ఇంటర్మీడియట్ విద్యార్థులను కోరారు.

# నాణ్యత లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు

**ప్రజాశక్తి - సదుం:** మండల పరిధిలోని నాణ్యతలేని, గడువు ముగిసిన విత్తనాలు, పురుగుల మందులు రైతులకు విక్రయిస్తే షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిత్తూరు మానవ వనరుల కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయ అధికారిని టివి నాగపద్మిని అన్నారు. గురువారం సదుం టౌన్‌లో విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల విక్రయ షాపుల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. అనంతరం రైతు సేవా కేంద్రం -2 లో ఎరువుల స్టాకు వివరాలు, ఆన్లైన్ ప్రాసెస్, రిజిస్టర్ తనిఖీలు నిర్వహించారు. అలాగే షాపులలోని స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, నిల్వలు, పురుగుల మందులు నాణ్యతలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారిని జె.మాధవి, వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న, జె.మాధవి పాల్గొన్నారు.

**ఎస్ఆర్ పురం :** మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను భూసార సంరక్షణ మధుసూదన్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు రిజిస్టర్స్ బిల్లు బుక్స్‌ను పరిశీలించారు. పురుగుల మందుల నాణ్యతను పరిశీలించారు. ఎంఆర్‌పి ధరలకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని ప్రభుత్వం సూచించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనికెలలో ఒక దుకాణంలో మసీన్‌కి రిజిస్టర్లో జాలికానీ 57, బస్తాలకి 15190 విలువచేసే ఉత్పత్తులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నర్మదా, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తహశీల్దార్‌కు షికారీల వినతి

**ప్రజాశక్తి- యాదమరి:** ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేయాలని షికారిలు తహశీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందించారు. కినాటంపల్లి గ్రామపంచాయతీలోని షికారి కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామానికి, రెవెన్యూ, పోలీసు మండల అభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు. షికారులు గ్రామంలోని సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామంలో 50 కుటుంబాలు ఉన్నాయని ఇళ్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే శ్మశాన సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ భూములను బోరు ఏర్పాటు చేయాలని, గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. తహశీల్దార్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ కులమతాలు భేదాలు లేకుండా అందరూ సమానమే, అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో మెలగాలని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. జీవన ప్రమాణానికి ఆటంకం కల్పిస్తే అలాంటి వారి సంబంధించి వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీసు, అభివృద్ధి, రెవెన్యూ శాఖల సమన్వయంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ డానియల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఎస్సీ నాయకులు మురుగేషన్, కోడిగుట్ట రవి, కుమార్, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ పార్థసారధి

# పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయాలి : డిఎల్‌పిఓ

**ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:** గ్రామాల్లో పారిశుద్ధ్యమే లక్ష్యంగా పనిచేయాలి డిఎల్‌పిఓ పార్వతమ్మ అన్నారు. మండలంలోని గురువారం గంగాధర నెల్లూరు, కొట్రకొన, పెద్ద కాలువ, వేల్కూరు, కోటాగరం, తూగుండ్రం ముక్కలతూరు, ఆత్మకూరు, ఆంబోదరపల్లి తదితర గ్రామాలలో ప్రత్యేకంగా చేపడుతున్న పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను, ముళ్ళ కంపలను, చెత్తాలు జెసిబి ద్వారా గ్రీన్ అంబాసిడర్లు తొలగించాలని అందుబాటులో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లకు తరలించాలని పేర్కొన్నారు. గ్రామాలలో మురుగునీరు నిలువ లేకుండా కాలువలను ప్రతిరోజు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులు కుళాయిల వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఇళ్ళ వద్ద నుండి సేకరిస్తున్న తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్లకు తరలించి కృత్రిమ ఎరువులు తయారు చేయాలన్నారు. ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, సర్పంచులు శ్రీ బాబు, ఏకాంబరం, పంచాయతీ సెక్రటరీలు దుర్గాప్రసాద్ రెడ్డి, కుమార్, కిరణ్ మురళి, జీవరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబితో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

# ఆదుకోవాలంటూ ఎంపీడీవోకు వినతి

**ప్రజాశక్తి- శాంతిపురం:** మండలంలోని మఠం గ్రామపంచాయతీ సంతూరు గ్రామానికి చెందిన దళిత కులానికి చెందిన సుమారు 10 కుటుంబాలు చెరువు అంచున ఇళ్ల కట్టుకుని జీవిస్తున్నారు. దీనికి రాజకీయ రంగు పులిమి కొంతమంది మీరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని మీరు చెరువులో ఇల్లు నిర్మించుకున్నారని ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారు. గత ఎనిమిది రోజుల నుండి చిన్న బిడ్డలు మహిళలు తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని స్థానిక శాంతిపురం మండల అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్ కన్నీళ్లతో సమస్య చెప్పుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన మండల అభివృద్ధి అధికారి సాయంత్రంలోపు మీ నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో అక్కడి నుండి మహిళలు వెనుతిరిగారు. ఈ విషయాన్ని దళిత నేతలు దేవరాజు మాదిగ, బాల చంద్రబాబు మాల తీవ్రంగా ఖండిస్తూ ఈ విషయాన్ని ఉన్నత అధికారులు, కడా పీడీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్తామని అప్పటికి న్యాయం జరిగిన పక్షంలో మండల సచివాలయం ముట్టడిస్తామని తెలిపారు.

# గుండెపోటు నివారణే లక్ష్యం

**ప్రజాశక్తి- విజయపురం (నగరి) :** గుండెపోటు నివారణే లక్ష్యంగా ఆస్పత్రిలో ఉన్న స్టెమీ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యూహెచ్ జరీనా తెలిపారు. ఆస్పత్రి సమావేశ హాల్‌లో పేషంట్లకు, అటెండెంట్లకు, మహిళలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని స్టెమీ యూనిట్‌లో గత ఏడాది 33 మందికి టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ వేయడం జరిగిందని 27మంది ప్రాణం కాపాడామన్నారు. గోల్డెన్ అవర్లో గుండెపోటు నుండి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం అత్యంత విలువైన స్టెమీ ఇంజెక్షన్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. గుండెపోటు తర్వాత ఆరు గంటల వరకు 'గోల్డెన్ అవర్' అంటారని ఆ సమయంలోపు తగిన చర్యలు తీసుకుంటే రోగి జీవితాన్ని కాపాడవచ్చన్నారు. గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో ఆరోగ్య శాఖ ఈప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఈ వ్యవస్థ గురించి తెలియజేస్తూ, గుండెపోటు లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్డియాక్ అరెస్ట్‌తో బాధపడుతున్న వ్యక్తిని గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆర్ఎంవో మంజుల, వైద్యులు కార్తీక్, ప్రవీణ, దీప్తివదన, శ్రీనాథ్, లోకేష్, జయంత్, మోనిక, జ్యోష్న, స్పందన, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** గుండె నొప్పి, సమస్యలు ఉన్న వారికి ఆధునిక వైద్యం అందిస్తున్నట్టు సిహెచ్‌సి వైద్యురాలు శిరీష తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో హృదయ రక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. శిరీష మాట్లాడుతూ ఎవరైనా గుండె నొప్పితో ఆసుపత్రికి వస్తే వారికి వెంటనే ఈసీజీ తీసి గుండె నొప్పి ఉందని నిర్ధారణ అయితే ఒక గంటలోపే వారికి రక్తం గడ్డ కట్టకుండా ఉండడానికి టెనిక్ ప్లేస్ అనే ఇంజక్షన్ వేయడం జరుగుతుందన్నారు. దీనివలన రోగిని గుండెకు సంబంధించిన డాక్టర్ల వద్దకు చేరుకునే లోపు ప్రాణాప్రాయం జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. డాక్టర్ శాలిని, డాక్టర్ స్వరూప్ నాయక్, డాక్టర్ భార్గవ్, డాక్టర్ రాగ భవన, డాక్టర్ విజయ కుమారి, హెడ్ నర్స్ సుమతి పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## దోపిడి దొంగలు దొరికారు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** చిత్తూరు పట్టణం దొడ్డిపల్లిలో ఉన్న సెల్వరాజ్ ఇంటి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసివారి వద్ద నుండి దొంగిలించబడిన సుమారు రూ. 19,42,000లు విలువ కలిగిన బంగారు, వెండి ఆభరణాలు నగదును వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్వరాజ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనం కేసులో చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంత చందోలు పర్యవేక్షణలో డిఎస్‌పి సాయినాథ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చిత్తూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జయరామయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.ఉమామహేశ్వర్ రావు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేయగా, రైల్వేకోడూరుకు చెందిన మణికంఠ ఏలూరుకు చెందిన మోహిద్దీన్ అలీ ఇంటి తలుపులు పగలగొట్టి బంగారు, వెండి నగలు, నగదు దొంగలించుకొని వెళ్లినట్టు గుర్తించినారు. గురువారం రాబడిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.జయరామయ్య తమిళనాడు, కట్పాడి, కింగ్ స్టన్ కాలేజీ సమీప ప్రాంతంలో సదరు దొంగలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం దొంగల వద్ద నుంచి 238.5 గ్రాముల బంగారు, 65 గ్రాముల వెండి ఆభరణాల విలువ రూ.14,36,000, నగదు రూ. 4,06,000లు, దొంగిలించిన నగదుతో కొన్న 3 సెల్‌ఫోన్స్, వాచ్ 1 వాటి విలువ సుమారు రూ. 1,00,000లు ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగతనానికి వాడిన మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో సదరు దొంగలు తాళం వేసివున్న ఇళ్ళను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు అంగీకరించారు. వీరిపైన ఇంకా కేసులు ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించారు.

మహిళ మెడలో

## గోల్డ్ చైన్ లాక్కెళ్లిన దుండగులు

గాయపడిన మహిళ

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని మాంబేడు పంచాయతీ కసవనూరు గ్రామానికి చెందిన చిట్టెమ్మ మెడలో ఉన్న బంగారు చైన్ను గుర్తు తెలీని వ్యక్తులు లాకెళ్లిపోయారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కసవనూరు గ్రామానికి చెందిన చిట్టెమ్మ దంపతులు తిరుపతి నుంచి సొంత గ్రామానికి వస్తుండగా పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట కనుమ వద్ద రోడ్డుపై గుంతలు ఉండటంతో ద్విచక్రవాహనాన్ని భర్త రామచంద్రారెడ్డి నెమ్మదిగా నడుపుతుండగా వెనుక వైపు నుంచి వస్తున్న దుండగులు ఆమె మెడలోని తాళి చైను లాక్కెళ్లారు. సదరు బంగారు చైను పది సవర్లు బంగారు అని ఆమె తెలిపారు. ఈప్రమాదంలో చిట్టెమ్మ మెడకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ ఇసుక సీజ్

**ప్రజాశక్తి- విజయపురం:** మండలంలోని నారపరాజు కండ్రిగలో గురువారం ఎస్ఐ బలరాం, వీఆర్ఏ ఇసుక డంపింగన్ను సీజ్ చేశారు. ఇసుక తమిళనాడుకు తరలిపోతుందని ఫిర్యాదులు రావడంతో పర్యవేక్షణ చేసి సీజ్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక తరలించే ట్రాక్టరులకు జీపీఆర్ కనెక్ట్ చేయాలని, అనుమతి లేకుండా రోడ్డుపై ఇసుక ట్రాక్టరు కనిపిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇలాంటివి జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ రవాణా చేసే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. గృహ నిర్మాణాలకు తప్ప వేరే ఎక్కడైనా డంపు చేయడం గాని రాత్రుల తరలించడం గాని ఇలాంటి పాల్పడితే కఠిన చర్యలు తప్పదన్నారు.

## గ్రామంలో పర్యటించిన జిల్లా అధికారులు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండల కేంద్రంలో ఆర్ఎంపిలు కొందరు వైద్యం కొనసాగిస్తున్నారు, వారి వైద్యం వికటించి మండలంలోని టిఎన్ కుప్పం గ్రామంలో ఎనిమిదేళ్ల చిన్నారి వైష్ణవి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో జిల్లా అధికారులు గురువారం తిరుమలనాయని కుప్పం గ్రామాన్ని సందర్శించారు. జిల్లా అధికారులు డాక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శిరీష, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ విజయ చందర్, రామచంద్రారెడ్డి, సహాయ జిల్లా మలేరియా అధికారి వైష్ణవి బాలిక మృతికి సంబంధించిన విషయాలపై ఆరా తీశారు. సరైన వైద్యం అందకపోవడం వల్లే బాలిక మరణించినట్లు తెలిపారు. అనంతరం గ్రామాల్లోని ఇళ్ల పరిసరాలు, అంగన్వాడీ కేంద్రం, తాగునీటి కొళాయిలు, మురుగనీటి కాలువలన్ను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేయాలన్నారు. సిహెచ్ఓ అనురాధ, సబ్ యూనిట్ అధికారి జయశంకర్, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, సూపర్వైజర్లు గోపి, పుష్పలత, మౌనిక, ఏఎన్ఎం సుశీల ఉన్నారు.

## కాలువలో వ్యర్థాలు తొలగింపు

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** మండలంలోని నలగంపల్లి పంచాయతీలో సర్పంచ్ షిబాస్వామి దాస్ పంచాయతీ కార్యదర్శి ఎల్లప్ప ఆధ్వర్యంలో మురుగునీటి కాలువలో వ్యర్థాలు తొలగింపు కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ మురికి కాలువల్లో వ్యర్థాలు తొలగించి దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు

**III court BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI**

**MCOP NO 4070 OF 2024**

R. Govardhan ... **Petitioner**

**VS**

1 M. Udayakumar **...1st Respondent**

2. M/S. Cholamandalam MS General Insurance, Co, Ltd **...2nd Respondent**

**TO**

M. Udayakumar, No. 10-14-248-NGO Colony, Nagari Mandal, Chittoor Dt, Andhra Pradesh-517590 **...1st Respondent**

Take notice that the above case is posted to 25.02.2025 at 10.30am before the Hon'ble IIIrd Judge Of Motor Accident Claims Tribunal, Chennai for your appearance either in person or through pleader without fail or otherwise the matter will be decided in your absence.

**Sd MR.R.RAMKUMAR**
ADVOCATE, CHENNAI
Counsel for the Petitioner

**VI COURT BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI**

**MCOP NO 2589 OF 2024**

Kuntrapakam Drakshayini **...Petitioner**

**VS**

1. Nadella Ramesh **...1st Respondent**

2. Nationl Insurance, Co, Ltd. **...2nd Respondent**

**TO**

Nadella Ramesh Son of Varadharajulu No.3-219, Brahmin Street, Chittoor Dt, **...1st Respondent**

Take notice that the above case is posted to 05.03.2025 at 10.30am before the Hon'ble VIth Judge Of Motor Accident Claims Tribunal, Chennai for your appearance either in person or through pleader without fail or otherwise the matter will be decided in your absence.

**MR.L.MOHAN RAO**
ADVOCATE, CHENNAI
Counsel for the Petitioner